

శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,99,759లు, బంగారం 3 గ్రాము 550 మిల్లీగ్రాములు, వెండి 57గ్రాముల 200 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



గంజాయి సాగు ధ్వంసం

పద్మపూర్ సమితి పరిధిలో గల తలపంగ, పురుణా సాహి అటవీ ప్రాంతాల్లో గంజాయి సాగుపై దాడులు నిర్వహించారు.

- 8లో



జగన్నాథునికి ప్రత్యేక పూజలు

జగన్నాథ మందిరంలో జగన్నాథ, బలరామ, సుభద్ర లకు హారతి దర్శనం కోసం మహిళలు పెద్ద ఎత్తున విచ్చేశారు.

- 8లో

న్యూస్‌రీల్

నాగావళి నదిలో యువకుడు గల్లంతు



గాలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రాయగడ: నాగావళి నదిలో స్నానం కోసం దిగిన యువకుడు గల్లంతయ్యాడు. గల్లంతైన వ్యక్తి స్థానిక గురుంగుడ గ్రామానికి చెందిన బుడు శ్రీను (37)గా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. యువకుని ఆచూకీ కోసం అగ్నిమాపక సిబ్బంది గాలిస్తున్నారు. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. గురుంగుడ గ్రామానికి చెందిన శ్రీను సోమవారం సాయంత్రం సమీపంలోని నాగావళి నదికి స్నానానికని వెళ్లాడు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా నది నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో అది గమనించని అతడు నీటిలో దిగగా అదుపు తప్పి ప్రవాహానికి కొట్టుకుపోయాడు. అగ్నిమాపక సిబ్బంది మంగళవారం ఉదయం నుంచి గురుంగుడ నుంచి సుమారు కిలోమీటరు దూరం వరకు నదిలో గాలించినప్పటికీ ఆచూకీ కనిపించలేదు.

జూదశాలపై పోలీసుల దాడులు

- 20 మంది అరెస్టు



అరెస్టయిన పేకాటరాయుళ్లు

జయపురం: జయపురం పట్టణ, సదర్ పోలీసులు సంయుక్తంగా పట్టణంలోని పలు ప్రాతాలలో జోరుగా సాగుతున్న పేకాట అడ్డాలపై ఆదివారం రాత్రి దాడులు నిర్వహించారు. ఈ దాడులలో 20 మంది పేకాటదారులను అరెస్టు చేశారు. ఆయా దాడులలో పెద్ద మొత్తంలో డబ్బు సీజ్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. స్థానిక సొరా వీధిలోని ఓ ఇంటిలో పేకాట ఆడుతున్న విషయం తెలుసుకున్న పోలీసులు దాడి చేసి తొమ్మిది మందిని అరెస్టు చేసి 79 వేల ఒక వంద రూపాయలను సీజ్ చేసినట్లు మంగళవారం వెల్లడించారు. అలాగే జయపురం సదర్ పోలీసులు పంపుణి గ్రామంలో త్రినాథ్ మందిరం సమీపంలో నిర్వహిస్తున్న పేకాటపై దాడి జరిపి 11 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 26 వేల 110 రూపాయలను స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. రాత్రి సమయం కావడంతో కొంతమంది పరారైనట్టు పోలీసు అధికారి వెల్లడించారు. అరెస్టు అయిన జూదగాళ్లకు నోటీసులు జారీ చేసి విడిచి పెట్టినట్లు పట్టణ పోలీసు అధికారి ఉల్లాష్ చంద్రరౌత్, జయపురం సదర్ పోలీసు అధికారి సచీంద్ర ప్రధాన్ చెప్పారు. ఇది ఇలాఉండగా ఒడిశాలో కార్తీక పూర్ణిమను జూదాల పూర్ణిమంగా పిలుస్తారు. ఈ సందర్భంగా ప్రతి చోట జూదం ఆడటం పరిపాటి. జూదాల పూర్ణమ సందర్భంగా జూదాలు ఆడే వారిపై దాడులు చేయటం భావ్యం కాదని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

మజ్జిగౌరి మందిరంలో అభివృద్ధి పనులకు శ్రీకారం



తాత్కాలిక దుకాణాలను తొలగిస్తున్న అధికారులు

రాయగడ: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవంగా పూజలందుకుంటున్న మజ్జిగౌరి మందిరం ప్రాంగణంలో పలు అభివృద్ధి పనులకు మంగళవారం శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.20 కోట్ల నిధులు మంజూరు చేసిన నేపథ్యంలో పనులు చేపట్టనున్నారు. దీనిలో భాగంగా పార్కు నుంచి ప్రధాన ముఖద్వారం వరకు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సంబంధించి ఆయా ప్రాంతంలోని తాత్కాలిక దుకాణాలను అధికారులు తొలగిస్తున్నారు. రెండేళ్ల వ్యవధి కాలంలో డీపీఆర్ ప్రకారం నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మందిరం సూపరింటెండెంట్ జానకీ వల్లభ్ , ఇంజినీర్ వెంకట్ తెలిపారు. భక్తుల సౌకర్యార్థం అన్ని వసతులతో మందిరం ప్రాంగణంలో అభివృద్ధి పనులు జరుగుతాయని చెప్పారు.

కాల్పుల కలకలం

- బీజేపీ సీనియర్ నేత, న్యాయవాది పిత్తాబాస్ పండాపై కాల్పులు
- ఛాతిలోకి దూసుకెళ్లిన బుల్లెట్లు
- ఘటనా స్థలంలోనే మృతి
- దుండగుల కోసం వేట





బరంపురం ఆస్పత్రిలో పిత్తాబాస్ పండా మృతదేహం (ఇన్‌సెట్లో) పిత్తాబాస్ పండా (ఫైల్)

పర్లాకిమిడి: బరంపురంలోని బ్రహ్మనగర్ సమీపంలో కాల్పులు కలకలం రేపాయి. సోమవారం రాత్రి 10 గంటల సమయంలో సీనియర్ న్యాయవాది, బీజేపీ గంజాం జిల్లా అధికార ప్రతినిధి పిత్తాబాస్ పండాను గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి అతి సమీపంలో రైఫిల్ రెండు రౌండ్లు కాల్పులు జరిపారు. ఛాతిలోకి బుల్లెట్లు దూసుకెళ్లడంతో ఘటనా స్థలంలోనే పిత్తాబాస్ మృతి చెందినట్టు బరంపురం ఎస్పీ ఎం.సరవనా వివేక్ వెల్లడించారు. పిత్తాబాస్ పండా బయటకు వెళ్లి తిరిగి బ్రహ్మనగర్‌లో తన ఇంటికి తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. సమాచారం తెలుసుకున్న స్థానికులు వెంటనే బరంపురం ఎం.కె.సి.జి.మెడికల్ ఆస్పత్రికి తరలించారు. పాయింట్ రేంజ్‌లో కాల్చడంతో వెన్నుముక దెబ్బతిన్నదని, ఊపిరాడక అక్కడికక్కడే మరణించాడని డాక్టర్ సుదీవ దాస్ తెలిపారు. విషయం తెలుసుకున్న గంజాం జిల్లా బార్ కౌన్సిల్ సభ్యులు పెద్ద ఎత్తున ఆస్పత్రికి తరలి వచ్చారు. పిత్తాబాస్‌ను ఎవరు.. ఎందుకు చంపారన్న విషయమై స్పష్టత రాలేదు. పోలీసులు రంగంలోకి దిగి దుండగుల కోసం వేట ప్రారంభించారు.

మంత్రుల సంతాపం..

పిత్తాబాస్ పండా హత్య విషయం తెలుసుకున్న రాష్ట్ర ఖనిజ శాఖ మంత్రి బిభూతీ జెన్నా, బీజేపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మన్మోహన్ సామల్, రాష్ట్ర మత్స్యశాఖ, పశుసంవర్ధక శాఖ మంత్రి గోకులానంద మల్లిక్, బరంపురం ఎంపీ ప్రదీప్ కుమార్ పాణిగ్రాహి ఆస్పత్రికి చేరుకుని సంతాపం తెలియజేశారు. పండా కుటుంబసభ్యులను ధైర్యం చెప్పారు. పండా మరణం తీరని లోటని గంజాం జిల్లా బీజేపీ నాయకులు పేర్కొన్నారు. పిత్తాబాస్ మృతిపై సమగ్ర దర్యాప్తు జరిపించి నిందితులను వెంటనే పట్టుకోవాలని గంజాం జిల్లా ఎస్పీ సరవనా వివేక్‌ను రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ ఆదేశించారు.

విజిలెన్స్ వలలో ఇంజినీర్

- రూ. 20 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం



విజిలెన్స్ అధికారులకు చిక్కిన ఇంజినీర్ లంభోదర నాయిక్

జయపురం: లంచం తీసుకుంటూ జయపురం సబ్‌డివిజన్ కుంద్ర సమితికి చెందిన ప్రభుత్వ ఇంజినీర్ లంభోదర నాయిక్ జయపురం విజిలెన్స్ అధికారుల వలలో పడ్డారు. ఒక కాంట్రాక్టర్‌కు బిల్లు పాస్ చేసేందుకు రూ. 20 వేలు ఇంజినీర్ డిమాండ్ చేశారు. దీంతో ఆయన విజిలెన్స్ అధికారులను ఆశ్రయించారు. వారు ఇచ్చిన సలహా మేరకు కాంట్రాక్టర్ ఆ డబ్బు ఇంజినీర్‌కు ఇస్తున్న సమయంలో విజిలెన్స్ సిబ్బంది దాడి జరిపి అతడిని రెడ్ హేండెడ్‌గా పట్టుకున్నారు. విజిలెన్స్ విభాగ అధికారుల సమాచారం ప్రకారం.. కుంద్ర సమితిలో గ్రామాభివృద్ధి రోడ్డు కుంద్ర శ్మశానం వరకు రూ. ఆరు లక్షల టెండర్ పనిని కాంట్రాక్టర్ ప్రఫుల్ల స్వైన్‌కు లభించింది. ఆ పని బిల్లు చేసేందుకు ప్రభుత్వ ఇంజినీర్ లంభోదర నాయిక్ కాంట్రాక్టర్‌ను 20 వేల రూపాయలు లంచంగా అడిగారు. ఈ విషయం ప్రఫుల్ల స్వైన్ జయపురం విజిలెన్స్ ఎస్పీ కార్యాలయంలో తెలిపాడు. విజిలెన్స్ అధికారుల సూచన మేరకు ఆదివారం సాయంత్రం స్వైయ్ డబ్బు తీసుకు వెళ్లి ఇంజినీర్‌కు అందజేశారు.అప్పటికే వేచి ఉన్న విజిలెన్స టీమ్ దాడి జరిపి డబ్బు సీజ్ చేసి ఇంజినీర్‌ను అరెస్టు చేశారు. విజిలెన్స్ ఎస్పీ రవీంద్రకుమార్ పండ ఆదేశం ప్రకారం.. డీఎస్పీ సదానంద పాణి, అజయ ప్రదాన్, సూర్యమణి టక్రి, ఇన్‌స్పెక్టర్ సూర్య ప్రకాశ నాయిక్, సంతోషి బారిక్, సంజయ ప్రదాన్, అమీన్ గౌరీ చంద్ర బాగ్, గగణ బిహారీ పండ, సుజిత్ కుమార్ నాయిక్, ఏఎస్సై దిలీప్ కుమార్ భుయ, కేశవ గరులు దాడిలో పాల్గొన్నారు. 2021లో లంభోదర్ నాయిక్ కుంద్ర సమితిలో ఇంజినీర్‌గా నియమితులయ్యారు. అనంతరం ఆయనను బొయిపరిగుడ సమితికి బదిలీ చేశారు.దసరా పండుగకు ముందుగా స్వైన్ కుంద్ర సమితికి పిప్యుటేషన్‌పై వచ్చారు. గతంలో కూడా అతనిపై ఒక విజిలెన్స్ కేసు ఉన్నట్లు తెలిసింది.

చోరీ కేసులో నిందితుల అరెస్టు



నిందితుల సమక్షంలో వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

రాయగడ: ఒక చోరీ కేసుకు సంబంధించి ఐదుగురు నిందితులను మునిగుడ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 50 గ్రాముల బంగారు గొలుసు, ఎనిమిది వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో చందిలి పోలీస్ స్టేషన్ పరిధిలోని జేకేపూర్ ప్రాంతానికి చెందిన సుజిత్ కొరకొరియా, అజయ్ బాగ్, మునిగుడకు చెందిన పింటు టకరి, ప్రమోద్, అమ్రాన్ భత్రలు ఉన్నారు. మునిగుడ ఎస్‌డీపీవో సంతోషిణి ఓరం, ఐఐసీ సౌదామణి బెహరలు ఈ మేరకు మంగళవారం నాడు మునిగుడ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

బస్సు ఢీకొని అక్కాచెల్లెళ్లు మృత్యువాత



ప్రమాదానికి గురైన బస్సు

కొరాపుట్: బస్సు ఢీకొన్న ఘటనలో అక్కాచెల్లెళ్లు మృత్యువాతపడిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. కత్ర అంబ గ్రామానికి చెందిన పితవాస్ ముదలి తన భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలతో కలిసి బైక్‌పై వెళ్తుండగా..కొరాపుట్ నుంచి రాయగడ వైపు వస్తున్న ప్రైవేటు బస్సు దశమంత్‌పూర్ సమితి పంచడ సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో బైక్‌పై అక్కాచెల్లెళ్లు భవానీ ముదలి (6), కవితా ముదలి (9) అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలిన ముగ్గురు కుటుంబ సభ్యులను స్థానికులు కొరాపుట్ జిల్లా కేంద్రంలోని సాహిద్ లక్ష్మణ్ నాయక్ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే బస్సు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టడంతో అందులో ఉన్న ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఘటన జరిగిన వెంటనే బస్సు డ్రైవర్ పరారయ్యాడు. దీంతో స్థానికులు ఘటనా స్థలానికి చేరుకొని రాస్తారోకో చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని చర్చలు జరపడంతో ఆందోళన విరమించారు.

పంట నష్టంపై సమీక్ష



పంట నష్టంపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

పర్లాకిమిడి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరి, మొక్కజొన్న, రాగులు, జొన్న పంటలు నాశనమయ్యాయి. జిల్లాలో నాలుగు సమితి కేంద్రాలు గుమ్మా, నువాగడ, రాయఘడ, మోహనా, గుసానిలో జరిగిన పంటనష్టంపై సంబంధిత అధికారులతో మంగళవారం జిల్లా కలెక్టర్ మధుమిత సమీక్షించారు. గుసాని, గుమ్మా, సమితి కేంద్రాలను సందర్శించారు. గుమ్మా బీడీఓ దులారాం మరాండీ, తహసీల్దార్ శరత్ శోబోరో, బీఈఓ, ఇతర అధికారులతో సమీక్షించారు. జిల్లాలో అధిక వర్షాలకు వంతెనలు, రోడ్లు, కల్వర్టులు నష్టమయ్యాయి. గజపతిలో రూ.80 కోట్ల నష్టం సంభవించినట్టు ప్రాథమికంగా తెలియజేశారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



బాలికల నృత్య ప్రదర్శన

జిల్లాలోని గుణుపూర్‌లో బాలల శిశు వికాస కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య, సంగీత పోటీలు అలరించాయి. జబర్‌గుడ, బాలనికేతన్, లిమామడ ప్రాంతాలోని సేవా సమాజంలో వంద మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. జిల్లా శిశు సురక్ష సమితి యూనిట్ అధికారి సీహెచ్ మహాదేవ్ ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్నారులను ప్రతిభను వెలికితీసేందుకు పోటీలు నిర్వహిస్తుండటం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రముఖ గాయకుడు మనోజ్ జెన్న, శివప్రసాద్ దాస్, సత్యనారాయణ జెన్నాలు, ఒడిశా నృత్య కళాకారుడు సుస్మిత పండ, గురు దిలీప్ చౌధరి, సాగరిక రాజ్‌గురులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

–రాయగడ



సంగీత పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు



పోటీల్లో పాల్గొన్న వివిధ పాఠశాలల విద్యార్థులు

ఫోన్ ఇవ్వలేదని పదేళ్ల బాలిక ఆత్మహత్య



మృతురాలు(ఫైల్)

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా ఖోయిర్‌పూట్ సమితి గోవిందపల్లి పంచాయతీ డేప్‌సాహి గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. తన తండ్రి మొబైల్ ఫోన్ ఇవ్వనందుకు పదేళ్ల బాలిక ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. అర్జున్ కిర్సనీ కుమార్తె స్థానిక గోవిందపల్లి పాఠశాలలో 5వ తరగతి చదువుతోంది. తన తండ్రి మొబైల్ ఫోన్‌లో తరచూ ఆత్మహత్యల వీడియోలు చూస్తుండేది. దీనిని గమనించిన తండ్రి ఫోన్ ఇవ్వడం మానేశాడు. ఈ క్రమంలో సోమవారం తండ్రికి ఫోన్ అడిగింది. అందుకు నిరాకరించడంతో ఇంట్లోనే ఓ గదిలోకి వెళ్లిపోయింది. కొంత సేపటి తర్వాత భోజనం కోసం తల్లి పిలవగా బాలిక ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించింది. వెంటనే బాలికను కిందకు దించి మత్తిలి ఆరోగ్య కేంద్రానికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మత్తిలి పోలీస్ ఐఐసీ దీపాంజాలి ప్రదాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో గజలక్ష్మి, కుమార పౌర్ణమి పూజలు



రఘునాథ్ మందిర కూడలి వద్ద గజలక్ష్మీదేవికి పూజలు చేస్తున్న వేద పండితులు

జయపురం: జయపురంలో గజలక్ష్మి, కుమార పూర్ణిమ పూజలు ఆడంబరంగా సోమవారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. రఘునాథ్ మందిర కూడలిలో ఏర్పాటు చేసిన పెండాల్‌లో ప్రతిష్ఠించిన గజలక్ష్మీదేవి విగ్రహానికి వేద పండితులు కృష్ణదాస్, శుభాంశు త్రిపాఠీలు వైదిక నియమ నిష్ఠలతో పూజలు చేసి ఆరంభించి ఐదు రోజులు జరగనున్న గజలక్ష్మి పూజలకు శ్రీకారం చుట్టారు. గజలక్ష్మి పూజలు నిర్వహించే ఐదు రోజులు ప్రతి రాత్రి సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని పూజా కమిటీ అధ్యక్షులు దేవేంద్ర బాహిణీపతి వెల్లడించారు. అలాగే గజలక్ష్మి పూజలతో పాటు కుమార పూర్ణిమ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పూజల అనంతరం స్థానిక కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలను జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్కళ సంస్కృతిలో కుమార పూర్ణిమ మహత్తు, ప్రాధాన్యలను వివరించారు. కార్తీక పూర్ణిమను అవివాహిత యువతులు భక్తితో ఆదర్శ వంతుడైన భర్త కొరకు పూజలు జరుపుకుంటారని వివరించారు. రాత్రి చంద్రుడుని చూసి కార్తికేయునికి పూజలు చేయాలన్నారు. అనంతరం స్థానిక కళాకారుల సంబలపురి డాన్స్‌లతో పాటు పలు జానపద, శాస్త్రీయ నృత్యాలు ప్రేక్షకులను అలరింప చేశాయి. జయపురం మున్సిపల్ చైర్మన్ నరేంద్రకుమార్, మహంతిబాబులి రథ్, రాజకిశోర్ దాస్, బాబు పాత్రో పాల్గన్నారు. పూజల్లో, సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించేందుకు అధికసంఖ్యలో జనం తరలివచ్చారు.

కొరాపుట్: గజలక్ష్మి పెండాల్స్‌ను బీజేపీకి చెందిన నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి మంగళవారం సందర్శించారు. నబరంగ్‌పూర్, కొసాగుమ్మ, నందాహండి సమితుల్లో గజలక్ష్మీకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయా ప్రాంతాలలో ఇటీవల మృతి చెందిన పలువురి నివాసాలకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వ పరంగా ఆర్థిక సాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.



సంబలపురి డ్యాన్స్ ప్రదర్శన



సాంస్కృతిక ప్రదర్శనలు తిలకిస్తున్న ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్, తదితరులు



నబరంగ్‌పూర్‌లో గజలక్ష్మీ పెండల్స్ వద్ద ఎమ్మెల్యే గౌరీ మజ్జి



బంకమరంలో గజలక్ష్మి పూజలు



కుమార ఉత్సవంలో పాల్గొన్న భక్తులు



బొయిపరిగుడలో కొలువుదీరిన గజలక్ష్మీదేవి

క్లుప్తంగా

గంజాయి సాగు ధ్వంసం



గంజాయి మొక్కలకు నిప్పుపెట్టి ధ్వంసం చేస్తున్న అధికారులు

రాయగడ: జిల్లాలోని పద్మపూర్ సమితి పరిధిలో గల తలపంగ, పురుణాసాహి, నువాసాహి, మహాదీమ్, తదితర అటవీ ప్రాంతాల్లో అక్రమంగా గంజాయి సాగవుతుందన్న సమాచారం మేరకు జిల్లా పోలీసులు, అబ్కారీ, అటవీ శాఖలకు చెందిన అధికారులు మంగళవారం సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఆరు ఎకరాల విస్తీర్ణంలో సాగు అవుతున్న గంజాయి మొక్కలను ధ్వంసం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. గంజాయి అక్రమ రవాణా, సాగుపై ఉక్కుపాదం మోపిన జిల్లా పోలీస్ యంత్రాంగం ఈ మేరకు విస్తృతంగా దాడులను నిర్వహిస్తోంది.

బస్సులో కత్తితో వీరంగం

భువనేశ్వర్ : పూరీ జిల్లా కొణాస్ బింధాన్ చౌరస్తా వద్ద లక్ష్మీ ప్రైవేటు బస్సులో ఓ యువకుడు వీరంగం సృష్టించాడు. కత్తితో దాడికి పాల్పడటంతో ఏడుగురికి గాయాలయ్యాయి. మొదట కత్తితో ఒక వ్యక్తిపై దాడి చేశాడు. తోటి ప్రయాణికులు అడ్డుకోవడంతో వారిపైనా కత్తి ఝుళిపించి గాయపరిచాడు. క్షతగాత్రులను వెంటనే ఆసుపత్రికి తరలించారు. హరసపడా నుంచి సుకొలా వస్తున్న మో బస్సులో ఈ ఘటన మంగళవారం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న కొణాస్ స్టేషన్ పోలీసులు యువకుడిని అరెస్టు చేశారు. నిందితుడు కొణాస్ బింధాన్‌కు చెందిన తపన్ భోయిగా గుర్తించారు.

కటక్‌లో కర్ఫ్యూ ఎత్తివేత

భువనేశ్వర్: కటక్ నగరంలో అల్లర్లు చెలరేగడంతో 36 గంటలు కర్ఫ్యూ విధించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో నగరం ప్రశాంత వాతావరణం నెలకొనడంతో కర్ఫ్యూను ఎత్తివేస్తున్నట్లు అధికారులు మంగళవారం ప్రకటించారు. కర్ఫ్యూ సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని జంట నగరాల పోలీస్ కమిషనర్ ఎస్.దేవదత్త సింగ్ తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాలలో దాదాపు 50 ప్లాటూన్ల పోలీసు బలగాలు మోహరించడంతో జనజీవనం సాధారణ స్థితికి చేరుకుందన్నారు. అయితే, పుకార్లు వ్యాప్తి చెందకుండా ముందు జాగ్రత్త చర్యగా సోషల్ మీడియా, ఇంటర్నెట్ సేవలపై ఆంక్షలు అమలులో ఉన్నాయని స్పష్టం చేశారు. పరిస్థితి పూర్తిగా స్థిరపడే వరకు భద్రత కట్టుదిట్టంగా ఉంటుందని తెలిపారు.

బాల్య వివాహం అడ్డగింత

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా బలిమెల పోలీసు స్టేషన్ పరిధిలో చితపారి పంచాయతీలో బాల్య వివాహాన్ని జిల్లా బాలల సంరక్షణ సిబ్బంది మంగళవారం అడ్డుకున్నారు. బలిమెల పోలీసులకు బాల్య వివాహం జరుగుతున్నట్లు సమాచారం వచ్చింది. ఐఐసీ ధీరజ్ పట్నాయక్ వెంటనే జిల్లా బాలల సంరక్షణ శాఖ అధికారి నారాయణ దాస్‌కు సమాచారం ఇచ్చారు. నారాయణదాస్ తన సిబ్బందితో చితపరి గ్రామానికి వెళ్లారు. అదు దోర అనే వ్యక్తి తన కుమారుడికి బాలికతో వివాహ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. పెళ్లి కుమారుడికి, కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. బాలికను మల్కన్‌గిరి బాలల ఆశ్రమ గృహానికి తరలించారు. ఈ మేరకు పెళ్లి కుమారుడు, కుటుంబంపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎరువుల పంపిణీకి సాంకేతిక లోపమే కారణం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని కళ్లేపల్లి గ్రామంలో ఎరువుల పంపిణీపై 'ఎరువుల కోసం టీడీపీ నేత ఇంటి వద్ద క్యూ' శీర్షికతో సాక్షి పత్రికలో మంగళవారం ప్రచురితమైన కథనానికి మండల వ్యవసాయ అధికారి నవీన్ కుమార్ ఒక ప్రకటనలో స్పందించారు. కళ్లేపల్లి గ్రామంలోని 196 మంది రైతులకు డీసీఎంఎస్ ద్వారా 333 యూరియా బస్తాలు వచ్చిన విషయం వాస్తవమేనన్నారు. వాటిని రైతుసేవ కేంద్రం ద్వారా ఇవ్వడానికి అన్ని ఏర్పాట్లు చేసినప్పటికీ, అక్కడ వైఫై పని చేయకపోవడంతో ఎదురుగా ఉన్న గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఇంటి నుంచి వైఫై కనెక్షన్ తీసుకొని తర్వాత రైతుసేవ కేంద్రం నుంచే ఎరువులు పంపిణీ చేశామన్నారు. సాంకేతిక కారణం వలనే ఇలా చేసినట్లు తెలియజేశారు.

పశువుల అక్రమ రవాణా అడ్డగింత



అక్రమంగా తరలిస్తున్న పశువులు

హిరమండలం: పశువుల అక్రమ రవాణాను హిరమండలం పోలీసులు అడ్డుకున్నారు. మంగళవారం హిరమండలంలో ఎస్‌ఐ వెంకటేష్ వాహనాలు తనిఖీలు చేస్తుండగా, ఎటువంటి అనుమతులు లేకుండా పశువులను బొలేరో వాహనంలో అక్రమంగా తరలిస్తుండంతో పట్టుకున్నారు. కొత్తూరు మండలం బలద సంతలో కొని అలమండ తరలిస్తుండగా పట్టుకున్నారు. దీంతో కొత్తవలసకు చెందిన జనార్థనరావు, గణపతిరావులపై కేసు నమోదు చేశారు. బొలేరో వాహనాన్ని సీజ్ చేశామని, ఎనిమిది పశువులను గుర్ల గోశాలకు తరలించామని ఎస్‌ఐ వెల్లడించారు.

గజలక్ష్మి పూజలు ప్రారంభం



రాయగడ:న్యూకాలనీలో పూజలందుకుంటున్న గజలక్ష్మి అమ్మవారు



మల్కన్‌గిరి: పూజల్లో పాల్గొన్న భక్తులు

రాయగడ: గజలక్ష్మీదేవి పూజలు ప్రారంభమయ్యాయి. స్థానిక న్యూకాలనీలో 30 ఏళ్లుగా ఈ పూజలను నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహించేందుకు సన్నహాలు చేశారు. గజలక్ష్మి అమ్మవారికి మంగళవారం నుంచి భక్తులు ప్రత్యేక పూజలను చేస్తున్నారు. సోమవారం సాయంత్రం ఆవాహన, ప్రాణ ప్రతిష్ట పూజలు జరిగాయి. మంగళవారం నుంచి 17 తేదీ వరకు పూజలను నిర్వహిస్తున్నట్లు పూజా కమిటీ అధ్యక్షుడు సంతోస్ కుమార్ పాత్రో తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పూజా పెండాల్ ఆకట్టుకుంటుంది. అదేవిధంగా స్థానిక ఆర్‌కే నగర్, సబ్ కలెక్టర్ కూడలి వద్ద గజలక్ష్మి పూజలు ప్రారంభమయ్యాయి.

పర్లాకిమిడిలో..

పర్లాకిమిడి: స్థానిక గాంధీ జంక్షన్ ఒడియా మంగళి వీధి వద్ద మంగళవారం నుంచి గజలక్ష్మి పూజలను ప్రారంభించారు. కార్తీక మాసంలో గజలక్ష్మి పూజలు, దర్శనం వల్ల పుణ్యం లభిస్తోందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈనెల 19 వరకూ పూజలు జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు.

మల్కన్‌గిరిలో..

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలోని పాత పోస్టుఫీస్ వీధిలో గత 26 ఏళ్లుగా సంప్రదాయబద్ధంగా జరుగుతున్న గజలక్ష్మీదేవి ఉత్సవాలు ఈసారి కూడా వైభవంగా చేయడానికి కమిటీ సభ్యులు నిర్ణయించారు. ఇందులో భాగంగా గౌరీ పౌర్ణమి సందర్భంగా సోమవారం సాయంత్రం అమ్మవారి విగ్రహం ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేసి మొక్కులు చెల్లించుకుంటున్నారు.



రాయగడ: ఆకట్టుకుంటున్న పెండాల్



రాయగడ: ఆకట్టుకుంటున్న పెండాల్



పర్లాకిమిడి: విద్యుత్ దీపాలంకరణ



మల్కన్‌గిరి: ప్రతిష్ఠించిన గజలక్ష్మి విగ్రహం

బీజేపీ పాలనలో దళితులకు రక్షణ కరువు



మాట్లాడుతున్న మల్లిక్, అప్పలస్వామి, హికక, తదితరులు

- పీసీసీ ఎస్సీ విభాగం ఛైర్మన్ మానస్ కుమార్ మల్లిక్

రాయగడ: అడ్డతోవలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వ పాలనలో దళిత వర్గాలకు రక్షణ కరువు అవుతుందని ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ ఛైర్మన్, న్యాయవాది మానస్ కుమార్ మల్లిక్ ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక కాంగ్రెస్ భవన్‌లో మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో దళిత వర్గాలకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పొందలేని ఎంతో మంది ఆదివాసీలు ఉపాధిని వెతుక్కుంటూ ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లి అక్కడి యాజమానుల నిరంకుశత్వానికి బలవుతున్నారన్నారు. పారిశ్రామకంగా అభివృద్ధి చెందుతున్న జిల్లాల్లో కూడా ఉపాధి అవకాశాలు కరువుతుండటం విచారకరమన్నారు.

ఓట్ల దొంగతనం..

గత సాధారణ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అడ్డదారిలోనే అధికారంలోకి వచ్చిన మాట వాస్తవమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈవీఎం ట్యాంపరింగ్‌కు పాల్పడటంతో ఆ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఈ విషయమై తన పోరాటం కొనసాగిస్తూ ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ప్రజలు ఇప్పటికైనా తెలుసుకొని ఆ పార్టీకి గట్టిగా బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. అధికారంలోకి రాకముందు ఎన్నో హామీలు ఇచ్చిన బీజేపీ.. అధికార పగ్గాలు చేపట్టిన అనంతరం వాటి మాట ప్రస్తావనకైనా తీసుకురావడం లేదని ఆరోపించారు. గత 25 ఏళ్ల బీజేడీ పాలనలో కూడా చెప్పుకొదగ్గ అభివృద్ధిని ఒడిశా రాష్ట్రం సాధించలేదని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో రాయగడ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు అప్పలస్వామి కద్రక, డీసీసీ మాజీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ పండా, డీసీసీ ఉపాధ్యక్షుడు శంకర్షన్ మంగరాజ్, బిసంకటక్ ఎమ్మెల్యే నీలమాధవ హికక, తదితరులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడికి యత్నం దురదృష్టకరం

శ్రీకాకుళం: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ గవాయ్‌పై దాడికి యత్నించడం దురదృష్టకరమని దళిత, ఆదివాసీ, బహుజన, మైనార్టీ సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు శ్రీకాకుళంలోని అంబేడ్కర్ జంక్షన్ వద్ద మానవహారం మంగళవారం నిర్వహించారు. అయా సంఘాల జేఏసీ నేతలు తైక్వాండో శ్రీను, కంత వేణుల ఆధ్వర్యంలో చేపట్టిన ఈ నిరసన కార్యక్రమంలో శ్రీకాకుళం బార్ అసోసియేషన్ న్యాయవాదులు కూడా పాల్గొని సంఘీభావం తెలిపారు. సీజేఐపై దాడికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని, భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నాయకులు బడే కామరాజు, ముంజేటి కృష్ణ, బాడాన దేవభూషణరావు, రౌతు శంకరరావు, ఎంఏ రఫీ, మహిబుల్లా ఖాన్‌లతో పాటు జిల్లా బార్ అసోసియేషన్ కార్యదర్శి పిట్ట దామోదరరావు, ఉపాధ్యక్షుడు సీతరాజు, ప్రతినిధులు బి.మురళీకృష్ణ, జె.శ్రీనివాసరావు, చలపతి రావు, డి.రాజ్ కుమార్‌లు మాట్లాడుతూ సీజేఐ గవాయ్‌పై దాడి యత్నాన్ని ఖండించారు. ఈ ఘటన న్యాయవ్యవస్థపై జరిగిన దాడిగా అభివర్ణించారు. ఇటువంటి చర్యలు ప్రమాదకరమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య, నాగరిక సమాజంలో దాడులకి స్థానం లేదన్నారు. కార్యక్రమంలో దళిత, ఆదివాసీ, బహుజన, మైనార్టీ నాయకులు వైశ్యరాజు మోహన్, నటుకుల మోహన్, యజ్జల గురుమూర్తి, అర్జి కోటి, పురుషో త్తం రాంబాబు, సంతు, అర్జి ఈశ్వరరావు, కొయిలా పు విజయ్, కొత్తూరు సత్యనారాయణ, పెయ్యల చంటి, అబ్బాస్, విజయ్, అఖిల్, రాము, మజ్జి గౌతమ్, రాహుల్, హేమంత్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



మానవహారం నిర్వహిస్తున్న దృశ్యం

పార్టీ కోసం పనిచేసేవారికి ప్రాధాన్యం



ఎమ్మెల్సీ నర్తు రామారావును సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కవిటి: వైఎస్సార్‌సీపీలో పార్టీ కోసం పనిచేసేవారికి సరైన ప్రాధాన్యం లభిస్తుందని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. మండలంలోని కొత్తపుట్టుగలో ఉన్న ఆయన నివాసంలో కవిటి మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ కడియాల ప్రకాష్ ఆధ్వర్యంలో మండల పార్టీ శ్రేణులు ఆయనను మంగళవారం సన్మానించారు. ఎమ్మెల్సీగా శ్రీకాకుళం జిల్లాతో పాటు ఇచ్ఛాపురం నియోజకవర్గ సమస్యలను శాసన మండలిలో ప్రస్తావించిన తీరును నాయకులంతా అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రామారావు మాట్లాడుతూ.. శాసన మండలి సమావేశాల్లో సమస్యలను ప్రస్తావించే అవకాశం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలనే దక్కిందని తెలియజేశారు. ఆయన ఆశయాల మేరకు ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో విజయబావుటా ఎగురవేసి కానుకగా ఇద్దామని పిలుపునిచ్చారు. కుసుంపురం గ్రామానికి చెందిన బెంతు సామాజిక నాయకుడు శివ బిసాయి మాట్లాడుతూ.. వర్షాకాల సమావేశాల్లో తమ బెంతు ఒరియాల సమస్యలను ప్రస్తావించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అవకాశం వచ్చిన ప్రతిసారీ ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూడాలని కోరారు. కడియాల ప్రకాష్ మాట్లాడుతూ.. పరిపూర్ణమైన అవగాహనతోనే నియోజకవర్గానికి సంబంధించిన ముఖ్యమైన సమస్యలను ప్రస్తావించారని కొనియాడారు. నియోజకవర్గంలోని రోగులు పడుతున్న అవస్థలు, రైతాంగం ఎదుర్కొంటున్నటువంటి సమస్యలు, ఉద్యోగాలు కోల్పోయి ఆకలితో అలమటిస్తున్న ఉద్దానం ఉద్యోగుల బాధలు, జిల్లా కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వెళ్లేందుకు పౌరులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో పాండవ శేఖర్, పీఎం తిలక్, పూడి నేతాజీ, బెందాళం జయప్రకాశ్, గోపయ్య, మురళి, బర్ల నాగభూషణం, కృష్ణారావు, నూతలపాటి బాబురావు, వై.అశోక్, రవి, నారాయణ స్వామి, బర్ల నాగు, కాయ భీమసేన్, దువ్వ కృష్ణారెడ్డి, పాండవ శేఖర్, పిరియా కృష్ణారావు, చందాన పూర్ణచంద్రుడు, దుద్ది ధర్మారావు, పాతిన వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

యువకుడు అనుమానాస్పద మృతి



ఉరికి వేలాడుతున్న మృతదేహం

కవిటి: మండలంలోని సహలాల పుట్టుగలో ఈనెల 1వ తేదీన జరిగిన అనుమానాస్పద మృతి కేసు వివరాలను కవిటి పోలీసులు మంగళవారం ఆలస్యంగా మీడియాకు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గొనియా సురేష్ ప్రధాన్(25) ఈనెల 1వ తేదీన తన జీడితోటలో జీడిచెట్టుకు టవల్‌తో ఉరివేసుకుని వేలాడుతుండడంతో అతని అక్క కె.పద్మ చూసింది. వెంటనే గ్రామస్తులు కవిటి పోలీసులకు తెలిపారు. దీంతో 2వ తేదీ ఉదయం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. అయితే అనుమానాస్పద మృతిగా నమోదు చేసి, విచారణ చేపడుతున్నట్టు కవిటి ఎస్‌ఐ వి.రవివర్మ తెలిపారు. ఈ విషయం ఎందుకు ఇన్ని రోజులు మీడియాకు వెల్లడించలేదని ప్రశ్నించగా.. తాను బందోబస్తు డ్యూటీకి వెళ్లిపోయినందువల్ల ఆలస్యం జరిగిందన్నారు. కేసుకు సంబంధించి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

సంతబొమ్మాళి: మండలంలోని వడ్డితాండ్ర రైల్వే గేటు సమీపంలో ట్రాక్‌పై పడి ఒక గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం రాత్రి మృతి చెందారు. వ్యక్తిపై నుంచి ట్రైన్ వెళ్లడంతో శరీరభాగాలు ముక్కలుగా పడి ఉన్నాయి. దీనిని గమనించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని రైల్వే ఆస్పత్రికి తరలించారు. చనిపోయిన వ్యక్తికి సుమారు 30 సంవత్సరాలు ఉంటాయని స్థానికులు అంటున్నారు.

ఆటో ఢీకొని వ్యక్తి దుర్మరణం



సవర విజయ్ మృతదేహం

మందస: లగేజీ ఆటో ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన మందస మండలంలో చోటుచేసుకుంది. తంగర పుట్టి గ్రామానికి చెందిన సవర విజయ్(25) సోమవారం మందస వచ్చి తిరిగి తమ గ్రామానికి వెళ్తుండగా రాయికోల గ్రామం వద్ద లగేజీ ఆటో ఢీకొంది. దీంతో తీవ్రగాయాలపాలైన యువకుడిని వైద్యం నిమిత్తం పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ యువకుడు మరణించారు. ఘటనపై మందస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పడవ బోల్తాపడి మత్స్యకారుడు మృతి



మృతుడు అంబటి యర్రయ్య

రణస్థలం: మండలంలోని జీరుపాలెం పంచాయతీ జగన్నాథపురం గ్రామానికి చెందిన అంబటి యర్రయ్య (47) పడవ బోల్తాపడి మృతి చెందారు. జేఆర్‌పురం పోలీసులు, స్థానిక మత్స్యకారులు తెలిపిన వివరాల మేరకు.. అంబటి యర్రయ్యతో పాటు మరో ముగ్గురు వాసుపల్లి పోతయ్య, దుమ్ము అప్పన్న, సూరాడ లక్ష్మణలు సముద్రంలో మంగళవారం ఉదయం వేటకు వెళ్లారు. తిరిగి మధ్యాహ్నం 2.30 గంటలకు ఒడ్డుకు వస్తున్న సమయంలో భారీ కెరటాలకు పడవ బోల్తా పడి నలుగురూ సముద్రంలో పడిపోయారు. వారిలో దురదృష్టవశాత్తు అంబటి యర్రయ్య సముద్రంలో మునిగిపోయి చనిపోయాడు. మిగతా ముగ్గురు ఒడ్డుకు క్షేమంగా చేరుకున్నారు. మృతుడికి భార్య యర్రమ్మ, ఇద్దరు కుమారుడు, కూతురు ఉన్నారు. జేఆర్‌పురం ఎస్‌ఐ ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జగన్నాథునికి ప్రత్యేక పూజలు



జగన్నాథ మందిరం వద్ద భక్తజనం

పర్లాకిమిడి: పౌర్ణమి మరుచటి రోజు మంగళవారం నుంచి ఒడియా వారికి కార్తీక మాసం ప్రారంభమైంది. జగన్నాథ మందిరంలో సాయంత్రం జగన్నాథ, బలరామ, సుభద్రలకు హారతి దర్శనం కోసం మహిళలు పెద్ద ఎత్తున విచ్చేశారు. వచ్చే పౌర్ణమి వరకు కార్తీక మాసం నియమాలు పాటిస్తారు.



జగన్నాథ, బలభద్ర, సుభద్రలకు హారతి దర్శనం

ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి

శ్రీకాకుళం పాతబస్టాండ్: నగరంలోని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు నివాళులర్పించారు. భగవంతుడే వాల్మీకి మహర్షిగా జన్మించి పురాణాలు రచించారని, అవి విశ్వమానవ సౌభ్రాతత్వంను చాటుతాయని నమ్ముతారని వివరించారు. పురాణాలంటే భారతీయులకు అత్యంత విశ్వాసమని పేర్కొన్నారు. రామాయణంపై సుదీర్ఘంగా వివరించారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకుడు ప్రగడ వెంకన్న, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి అనురాధ, కలెక్టరేట్ పరిపాలనాధికారి జీఏ సూర్యనారాయణ, జెడ్పీ సీఈవో డి.సత్యనారాయణ, సెట్విస్ సీఈవో అప్పలనాయుడు, పీజీఆర్‌ఎస్ సూపరింటెండెంట్ ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.

పోడు పంట.. ఆరోగ్యకరమంట..!



సవర జాడుపల్లి గ్రామం వద్ద పండ్లను విక్రయిస్తున్న గిరిజన మహిళలు

- అధికంగా పండిస్తున్న సవరజాడుపల్లి గిరిజనులు
- సేంద్రియ పంటలు విక్రయిస్తూ జీవనం
- ఆసక్తి చూపిస్తున్న పరిసర ప్రాంతాల ప్రజలు

మెళియాపుట్టి:

ప్రస్తుతం మనం తీసుకునే ఆహార పదార్థాల్లో అత్యధిక శాతం రసాయనిక ఎరువులు వినియోగించి పండించినవే. మార్కెట్‌లో రసాయనిక ఎరువులు లేకుండా పండిన కూరగాయలు, పండ్లు దొరకడం ఈరోజుల్లో గగనమైపోయింది. అయితే ఇటువంటి తరుణంలో మండలంలోని సవర జాడుపల్లి గ్రామానికి చెందిన గిరిజనులు పోడు భూముల్లో సేంద్రియ పద్ధతిలో పంటలు, పండ్లను పండిస్తూ ఆరోగ్యానికి భరోసానిస్తున్నారు. వారికి ఉన్నటువంటి పోడు భూముల్లో నిత్యం పనులు చేసుకుంటూ ఆరోగ్యకరమైన పంటలకు ప్రాధాన్యమిస్తూ జీవన భృతిని కొనసాగిస్తున్నారు. సీతాఫలం, జామ, అరటి, పనస, అనాస, బొప్పాయి, మామిడి, జీడి వంటి పంటలను పండిస్తూ గ్రామ సమీపంలోని రహదారి వద్ద విక్రయిస్తుంటారు. సహజ సిద్ధంగా పండిస్తున్న పంటలు కావడంతో రాహదారిలో రాకపోకలు సాగించేవారు అధికంగా కొనుగోలు చేస్తుంటారు. అయితే ప్రభుత్వ సహకారం అందిస్తే మరిన్ని రకాలైన కమలా, బత్తాయి, దానిమ్మ, నిమ్మ లాంటి తోటలు పెంపకానికి అవకాశం ఉంటుందని అక్కడి గిరిజనులు చెబుతున్నారు.

ప్రతిరోజూ విక్రయిస్తాం



మా గ్రామంలో సుమారుగా అన్ని కుటుంబాలు అడవిపై ఆధారపడి జీవనం పొందుతున్నాము. మా పోడు భూముల్లో ఎటువంటి ఎరువులు లేకుండా పండించి అమ్ముతాము. నాకున్న కొద్దిపాటి పోడుభూమిలో బొప్పాయి, పనస, అరటి తోటలు వేసుకున్నాను.

– సవర శాంతమ్మ, సవర జాడుపల్లి

ప్రభుత్వం సహకరించాలి



పోడు భూములు మాకు దైవంతో సమానం. వాటిలోనే పంటలు పండించుకుని అమ్ముతాము. మా గ్రామానికి చాలా మంది వచ్చి పంట లు కొనుగోలు చేస్తుంటారు. కొన్ని తీసుకుని వెళ్లి రహదారి పక్కన అమ్ముతాము. మేము ధరలు అధికంగా చెప్పము. ఏదో ఒక ధరకి విక్రయించడమే మాకు తెలుసు. అధికారులు, ప్రభుత్వం సహకారం అందిస్తే మరింతగా పంటలు పండిస్తాం.

– సవర సరస్వతి, సవర జాడుపల్లి

క్లుప్తంగా

తప్పిన ప్రమాదం



దేరువాడ సమీపంలో రోడ్డు పక్కకు ఒరిగిన ఆర్టీసీ బస్సు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని దేరువాడ గ్రామ సమీపంలో భారీ ప్రమాదం త్రుటిలో తప్పింది. వివరాల్లోకి వెళ్తే.. మంగళవారం ఉదయం బీరుపాడు గ్రామం నుంచి ప్రయాణికులతో వయా కురుపాం పార్వతీపురానికి బయల్దేరిన ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు మార్గమధ్యలోని దేరువాడ సమీపానికి వచ్చే సరికి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనానికి దారి మళ్లించే క్రమంలో రోడ్డు పక్కకు దిగడంతో టైర్లు మట్టిలో దిగబడిపోయాయి. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి బస్సును నిలుపుదల చేయడంతో పక్కకు బోల్తా పడకుండా ఆగింది. దీంతో ఆ బస్సులో ఉన్న సుమారు 118 మంది ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

అనంతగిరి సమీపంలో ఏనుగులు



అనంతగిరి సమీపంలోని మొక్కజొన్న పంటలో ఏనుగులు

భామిని: మండలంలో ఏబీ రోడ్డు పక్కనే గల అనంతగిరి సమీపంలో ఏనుగులు మంగళవారం కనిపించాయి. గ్రామానికి ఆనుకొని ఉన్న మొక్కజొన్న పంట చేలలో నాలుగు ఏనుగులు తిరుగాడుతూ పంటలను ధ్వంసం చేస్తుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఏబీ రోడ్డుపైకి ఏ క్షణం అయినా రావచ్చని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు : కలెక్టర్

పార్వతీపురం రూరల్: జిల్లాలో గత రెండు రోజులుగా చేపట్టిన పారిశుధ్య పనులు ముమ్మరంగా జరుగుతూ మార్పుతో కూడిన ప్రగతి సంతరించుకున్నట్టు కలెక్టర్ డా. ఎస్.ప్రభాకరరెడ్డి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా మంచినీటి ట్యాంకుల క్లోరినేషన్ కాలువల శుభ్రత వంటి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. తహసీల్దార్లకు నోడల్ అధికారులుగా నియమిస్తూ ఆ మండలాల పరిధిలో ఉన్న గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించినట్టు తెలిపారు. ఈ మేరకు మంచినీటి ట్యాంకులు క్లోరినేషన్ చేయడంతో పాటు మురుగునీటి కాలువలు శుభ్రపరచడం, బ్లీచింగ్ చల్లడం, పూడికలు తీసి స్ప్రేయింగ్ చేయడం గత రెండు రోజులుగా 15 మండలాల్లోని 1125 మంచినీటి ట్యాంకులను శుభ్రపరచి 2,388 మురుగునీటి కాలువలను శుభ్రపరచినట్టు తెలిపారు. 1398 ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లి స్ప్రేయింగ్ చేసినట్టు కలెక్టర్ వివరించారు.

గంజాయి స్వాధీనం

పాచిపెంట: మండలంలోని పి.కోనవలస చెక్ పోస్టు వద్ద ముగ్గురు వ్యక్తుల నుంచి ఐదు కేజీల గంజాయిని మంగళవారం పట్టుకున్నట్టు ఎస్ఐ వెంకటసురేష్ తెలిపారు. ఒడిశా రాష్ట్రం గుప్తేశ్వరంలో కొనుగోలు చేసి, కాశికి తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. ముద్దాయిలను అదుపులోకి తీసుకున్నామని దీనిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

రైతు సేవా కేంద్రంలో చోరీ

కురుపాం: మండలంలోని గుమ్మ గ్రామంలో ఉన్న రైతు సేవా కేంద్రంలో దొంగతనం జరిగింది. వివరాల్లోకి వెళితే మంగళవారం రైతు సేవా కేంద్రానికి చెందిన ఉద్యోగులు విధి నిర్వహించేందుకు వెళ్లారు. కేంద్రానికి వేసిన తాళం పగులగొట్టి కంప్యూటర్‌తో పాటు సంబంధిత పరికరాలను సైతం సోమవారం రాత్రి చోరీ చేసినట్టు ఉద్యోగులు గుర్తించారు. వెంటనే రైతుసేవా సిబ్బంది కురుపాం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ నారాయణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడుల కేసులో విచారణ వేగవంతం

గుర్ల: మండలంలోని జమ్ములో జరిగిన దాడుల కేసులో విచారణ వేగవంతం చేస్తున్నట్టు సీఐ జి.శంకరరావు తెలిపారు. జమ్ములో ఫోరెన్సిక్స్ బృందం మంగళవారం ఆధారాలు సేకరించింది. దాడులలో నమోదు అయిన రెండు కేసుల్లో ఇప్పటికే 20 మందిని అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం విశాఖపట్నం సెంట్రల్ జైలుకు తరలించినట్టు చెప్పారు.

ఓద్రుబంగి వాసి ఒడిశాలో మృతి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఓద్రుబంగి గ్రామానికి చెందిన పి.పారయ్య(45) ఒడిశాలో మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన ఇరువురు వ్యక్తులతో కలిసి ఒడిశాలోని శిఖల ప్రాంతంలో వెటకు వెళ్లగా.. ప్రమాదవశాత్తు వారి వెంట తీసుకెళ్లిన నాటుతుపాకీ తూటా తగిలి మృతి చెందాడని.. సమాచారం తెలుసుకున్న కుటుంబీకులు ఆ మృతదేహాన్ని మంగళవారం ఓద్రుబంగి గ్రామానికి తీసుకొచ్చారు. అయితే ఒడిశాలో మృతి చెందడం వలన ఒడిశాకు చెందిన రామన్నగూడ పోలీసులకు అందిన సమాచారం మేరకు మృతదేహాన్ని మరలా స్వాధీన పర్చుకుని, దర్యాప్తు చేస్తున్నట్టు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కాగా మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆరోగ్యమిత్రలపై.. కూటమి కక్ష!



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న ఆరోగ్యమిత్ర

- సమాన పనికి సమాన వేతనం కావాలని కోర్టును ఆశ్రయించిన ఆరోగ్యమిత్రలు
- దీంతో 72 మందికి జీతాలు ' నిలిపివేసారనే ఆరోపణలు
- రెండు నెలలుగా జీతాలు అందని పరిస్థితి
- అవస్థలు పడుతున్న ఆరోగ్యమిత్రలు
- రాష్ట్రంలో విజయనగరం జిల్లాకు చెందిన మిత్రలకే ఎక్కువ మందికి జీతాలు అందని పరిస్థితి

విజయనగరం ఫోర్ట్: ఎన్‌టీఆర్ వైద్య సేవ (ఆరోగ్యశ్రీ) పథకంలో పని చేస్తున్న ఆరోగ్యమిత్రల పట్ల కూటమి సర్కార్ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందులో భాగంగా వారికి రెండు నెలలుగా జీతాలు నిలిపివేసిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జీతాలు అందకపోవడంతో ఆరోగ్యమిత్రలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ జీతాల గురించి అధికారులను అడిగితే సరైన సమాధానం చెప్పడం లేదని ఆరోగ్యమిత్రలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీతాల గురించి ఆరోగ్యశ్రీ అధికారులను అడిగితే అప్కాస్‌లో సమస్య అని, అప్కాస్ వారిని అడిగితే ట్రస్టులో సమస్య అని ఒకరిపై ఒకరు నెట్టుకుంటున్నారని ఆరోగ్యమిత్రలు వాపోతున్నారు.

జిల్లాలో 94 మంది ఆరోగ్యమిత్రలు

జిల్లాలో 34 ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు ఉన్నాయి. వీటిల్లో 94 మంది ఆరోగ్య మిత్రలు పని చేస్తున్నారు. వీరిలో 72 మంది ఆరోగ్య మిత్రాలకు గత రెండు నెలలుగా జీతాలు అందడం లేదు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల జీతాలు వీరికి అందలేదు. సమాన పనికి సమాన వేతనం ఇప్పించాలని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆరోగ్యమిత్రలు కోర్టును ఆశ్రయించారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని కూటమి సర్కార్ ఆరోగ్య మిత్రలకు జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తుందనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో అత్యధికంగా విజయనగరం జిల్లాకు చెందిన ఆరోగ్యమిత్రలకే జీతాలు నిలిచిపోవడం గమనర్హాం. ఎన్‌టీఆర్ వైద్య సేవ(ఆరోగ్యశ్రీ)పరిధిలో ఉన్న వ్యాధులకు చికిత్స కోసం వచ్చే వారికి ముందుగా రిజిస్ట్రేషన్ చేసి సంబంధిత వైద్యుని దగ్గరకు వీరు పంపిస్తారు. ఆస్పత్రిలో చికిత్స కోసంగాని, శస్త్రచికిత్స కోసం చేరినట్టయితే వారికి సకాలంలో చికిత్స, శస్త్రచికిత్స జరిగేటట్టు చూడడం ఆరోగ్యమిత్రల యొక్క విధులు. అదే విధంగా ఆరోగ్యశ్రీ రోగులకు నాణ్యమైన భోజనం పెడుతున్నారా.. లేదా.. అని పర్యవేక్షించడం, ఏదైనా ఆస్పత్రి సిబ్బంది సేవలు అందించడం కోసం చేతి వాటం ప్రదర్శించినట్టయితే వారి ఫిర్యాదును కో ఆర్డినేటర్ దృష్టికి తీసుకెళ్లడం వీరి యొక్క విధి.

జీతాలందక అవస్థలు

జీతాలు అందకపోవడం వల్ల ఆరోగ్యమిత్రలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కుటుంబ పోషణ, స్కూలు ఫీజులు వంటివి చెల్లించడానికి ఇబ్బంది పడుతున్నారు. తమతో పని చేయించుకుంటున్న అధికారులు జీతాల గురించి మాత్రం ఏ సమాధానం చెప్పకుండా దాట వేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఒకరిపై ఒకరు నెట్టుకుంటున్నారు..



జిల్లాలో 72 మంది ఆరోగ్య మిత్రలకు జీతాలు రెండు నెలలుగా రాలేదు. దీనిపై ఆరోగ్యశ్రీ ట్రస్ట్ అధికారులను అడిగితే అప్కాస్‌లో సమస్య అని, అప్కాస్ అధికారులను అడిగితే ట్రస్ట్‌లో సమస్య ఉందని ఒకరిపై ఒకరు నెట్టుకుంటున్నారు. సరైన సమాధానం చెప్పడం లేదు. కోర్టును ఆశ్రయించామని జీతాలు నిలిపివేసారో, మరో ఏ కారణం తెలియడం లేదు. జీతాలు రాకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నాం.

– జెర్రి పోతుల ప్రదీప్, ఆరోగ్యమిత్రల సంఘం జిల్లా అధ్యక్షుడు

వాస్తవమే..

ఆరోగ్యమిత్రలకు జీతాలు రాని మాట వాస్తవమే. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం.

– డాక్టర్ కుప్పిలి సాయిరాం. ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్

ఘనంగా వాల్మీకి జయంతి



వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన డీఆర్‌వో శ్రీనివాసమూర్తి

విజయనగరం అర్బన్: రామాయణాన్ని అందించిన మహర్షి వాల్మీకి అని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి అన్నారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలిత డీఆర్‌వో ఎస్.శ్రీనివాసమూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వాల్మీకి రచించిన రామాయణం నేడు యావత్ ప్రపంచానికి ఆదర్శమని కొనియాడారు. వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకొని వారి జీవిత చరిత్రను ఒకసారి స్మరించుకోవలసిన అవసరం ఉందని పేర్కొన్నారు. వాల్మీకి మహర్షి జయంతిని గురించి రామాయణంలోని ఉత్తరకాండలో వివరించబడిందన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమాధికారిణి జె.జ్యోతి, సీపీవో పి.బాలాజీ, జిల్లా టూరిజం కల్చర్ అధికారి కుమారస్వామి, ఐసీడీఎస్ పీడీ విమలారాణి, డీసీహెచ్ఎస్ డాక్టర్ రాణి, మార్క్‌ఫెడ్ మేనేజర్ వెంకటేశ్వరరావు, డివిజనల్ పౌర సంబంధాల అధికారి ఎస్.జానకమ్మ, బీసీ వసతిగృహ సంక్షేమాధికారులు, కలెక్టరేట్‌లోని వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

దళితవాడల్లో శ్రీవాణి ట్రస్టు ద్వారా 1000 ఆలయాల నిర్మాణం

- రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

విజయనగరం ఫోర్ట్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దళిత, గిరిజన వాడల్లో శ్రీవాణి ట్రస్టు ద్వారా టీటీడీ నిధులతో 1000 దేవాలయాలు నిర్మించాలని నిర్ణయించినట్టు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడించారు. శ్రీపైడితల్లి అమ్మవారి జాతర సందర్భంగా మంగళవారం అమ్మవారికి దేవదాయ శాఖ తరపున పట్టు వస్త్రాలను సమర్పించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హిందూ సాంప్రదాయాలను కాపాడాలనే ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ఆలయాలను అభివృద్ధి చేసేందుకు, పురాతన ఆలయాలను పునఃనిర్మించడానికి చర్యలు తీసుకుంటున్నామని తెతిపారు. పైడితల్లి అమ్మవారి ఆలయం పునః నిర్మాణ పనులకు రూ.1.80 కోట్లు మంజూరు చేసామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితిగజపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

13న డేటా ఎంట్రీ ఆపరేటర్ల పోస్టులకు ఇంటర్వ్యూ

విజయనగరం ఫోర్ట్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో డేటా ఎంట్రీ ఆపరేటర్ల పోస్టుల నియామకానికి ఈ నెల 13వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అల్లు పద్మజ ఓ ప్రకటనలో మంగళవారం వెల్లడించారు. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆస్పత్రి సమావేశ మందిరంలో అభ్యర్థులను ఇంటర్వ్యూ చేయడం జరుగుతుందన్నారు. విజయనగరం జిల్లాకి చెందిన వారే అర్హులని, ఏదైనా డిగ్రీ(75 శాతం), పీజీడీసీఏ(25 శాతం) మార్కుల ఆధారంగా ఎంపిక ఉంటుందన్నారు.

మరణంలోనూ వీడని బంధం!

పెంచిన మమకారం...తండ్రితో ఉన్న అనుబంధం ఆ కొడుకును నిలవనీయలేదు.. జన్మ కారకుడైన తండ్రి ఇక లేడనే విషాదం ఆ కొడుకు గుండె తట్టుకోలేకపోయింది. తండ్రి మృతిని తలుచుకుంటూ శ్మశాన వాటిక నుంచి ఇంటికి వస్తూనే కుమిలిపోసాగాడు. ఆ బాధను ఆ గుండె తట్టుకోలేకపోయింది. అటు తండ్రి చితి ఆరక ముందే తనువు చాలించాడు. ఈ విషాద ఘటన వివరాల్లోకి వెళ్తే...

- తండ్రి చితి ఆరక ముందే కొడుకు మృతి
- తండ్రి మృతిని తట్టుకోలేక 24 గంటలు గడవక ముందే తనువు చాలించిన కుమారుడు
- బొద్దాంలో హృదయ విదారక ఘటన



కొన్న బాలకృష్ణ (ఫైల్)



అప్పలరాజు (ఫైల్)

రాజాం సిటీ: తండ్రి చితి ఆరక ముందే కుమారుడు మృతి చెందిన హృదయ విదారక ఘటన మండల పరిధి బొద్దాం గ్రామంలో చోటు చేసుకుంది. తండ్రీకొడుకు 24 గంటల వ్యవధిలో మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. ఈ ఘటన అందరినీ కలచివేసింది. మండల పరిధి బొద్దాం గ్రామానికి చెందిన కొన్న బాలకృష్ణ (65) ఈ నెల 6వ తేదీన వేకువజామున గుండెపోటుకు గురై మృతి చెందాడు. ఈయన డోలక్ వాయిద్యంలో ప్రసిద్ధిగాంచిన కళాకారుడుగా గుర్తింపు పొందాడు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించాడు. పౌరాణిక, సాంఘిక నాటకాలకు డోలక్ వాయిస్తూ తనకంటూ ఓ ప్రత్యేకతను చాటుకున్నాడు. ఈయనకు ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడు కనకరాజు తెలంగాణాలో పోలీసుగా విధులు నిర్వహిస్తున్నాడు. రెండో కుమారుడు అప్పలరాజు ఇంటి వద్దే ఉంటూ పెయింటింగ్ పనులు చేసుకుంటున్నాడు. చిన్న కుమారుడు సాయికృష్ణ ఉపాధ్యాయునిగా స్థిరపడ్డాడు.

తండ్రి చితి ఆరక ముందే..

కొన్న బాలకృష్ణ మృతి చెందిన 24గంటలు గడవక ముందే తన రెండో కుమారుడు అప్పలరాజు (32) మృతి చెందాడు. తన తండ్రితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ దహన సంస్కారాల అనంతరం ఇంటికి చేరిన కాసేపటికే ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. కుటుంబీకులు, సహచరులు హుటాహుటిన రాజాం ఆస్పత్రికి తరలించగా అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 6న అర్ధరాత్రి దాటిన తరువాత మృతి చెందినట్టు గ్రామస్తులు తెలిపారు. ఈయనకు ఏడాది క్రితమే వివాహం జరిగింది. 24 గంటల వ్యవధిలో తండ్రీకొడుకు మృతి చెందడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ విషాద ఘటన గ్రామస్తులను కంటతడి పెట్టించింది.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే గిరిజన విద్యార్థుల మరణాలు

- మంత్రి సంధ్యారాణి వ్యాఖ్యలపై రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ధ్వజం



మాట్లాడుతున్న ఎం.కృష్ణమూర్తి

పార్వతీపురం రూరల్: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల మరణాలకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని, దీనిపై మంత్రి సంధ్యారాణి బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి మంగళవారం తీవ్రంగా విమర్శించారు. విద్యార్థులు ఇళ్ల వద్ద చనిపోయారంటూ ప్రభుత్వ తప్పును కప్పిపుచ్చుకోవాలని చూడటం దారుణమన్నారు. ప్రభుత్వం సరైన వసతులు కల్పించి ఉంటే ఈ దుస్థితి వచ్చేది కాదన్నారు. గిరిజన విద్యార్థుల బాగోగులను ప్రభుత్వం సరిగా పర్యవేక్షించి ఉంటే 120 మందికి పచ్చకామెర్లు ఎలా వచ్చాయి? పది నెలల్లో 11 మంది ఎలా చనిపోయారు? అని ఆయన ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. కలుషిత నీరు, అపరిశుభ్రతే ఈ అనర్థాలకు మూలమని, ఏళ్ల తరబడి ఏఎన్ఎంలను నియమించకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. మృతుల కుటుంబాలకు రూ.30 లక్షల నష్టపరిహారం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి హాస్టల్‌లో వెంటనే ఏఎన్ఎంను నియమించి, సురక్షిత నీరు, పౌష్టికాహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

కమిషనర్ తీరుపై కలెక్టర్‌కు చైర్‌పర్సన్ ఫిర్యాదు

- కౌన్సిల్ తీర్మానాన్ని లెక్క చేయడం లేదు..
- తగు చర్యలు తీసుకోవాలని వినతి



కలెక్టర్ డా. ఎస్.ప్రభాకరరెడ్డితో మాట్లాడుతున్న పార్వతీపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రంలో పార్వతీపురం మున్సిపల్ పరిధిలో నిరాశ్రయుల వసతిగృహం నిర్వహణ బాధ్యతల అప్పగింతపై నెలకొన్న సమస్యపై మున్సిపల్ కమిషనర్ ఏకపక్ష వైఖరితో కౌన్సిల్ తీర్మానాన్ని అమలు చేయకుండా అడ్డుకుంటున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి కలెక్టర్ డా. ఎస్.ప్రభాకరరెడ్డిని మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరీ మాట్లాడుతూ పురపాలక సంఘం పరిధిలోని నిరాశ్రయుల వసతిగృహ నిర్వహణ కోసం స్థానికత ఉన్న ఆదర్స్ రూరల్ అండ్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు బాధ్యతలు అప్పగించాలని 30 సెప్టెంబర్ 2024న కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానం నంబరు 633 ద్వారా నిర్ణయించిందని పేర్కొన్నారు. అయితే కొత్తగా వచ్చిన కమిషనర్ దీనిపై అభ్యంతరాలు లేవనెత్తడంతో ఈ ఏడాది 31 జూలైన మరోసారి పాత తీర్మానాన్ని బలపరుస్తూ తీర్మానం నంబరు 765ను ఆమోదించినట్టు తెలిపారు. ఈ నిర్ణయాన్ని మినిట్ బుక్‌లో కూడా స్పష్టంగా నమోదు చేశామన్నారు. అయితే మున్సిపల్ చట్టం ప్రకారం కౌన్సిల్ తీర్మానం మినిట్ బుక్‌లో నమోదయ్యాక దానిని అమలు చేయాల్సిన బాధ్యత కమిషనర్‌పై ఉంటుందని వివరించారు. కానీ నెలలు గడుస్తున్నా కమిషనర్ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తే ఫైల్ కలెక్టర్ వద్ద ఉందని, ఆయనే తేలుస్తారంటూ తప్పించుకుంటున్నారని వెల్లడించారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన పాలకవర్గాన్ని, కౌన్సిల్ అధ్యక్షురాలైన తనను ఈ విధంగా వ్యవహరిస్తూ అవమానించడమేనని ఆమె స్పష్టం చేశారు. చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారే నిబంధనలను ఉల్లంఘిస్తున్నారన్నారు. కలెక్టర్ ఈ విషయంలో స్పందించి కౌన్సిల్ తీసుకున్న నిర్ణయాన్ని గౌరవించి అర్హత పొందిన సంస్థకు తక్షణమే నిరాశ్రయుల వసతిగృహం బాధ్యతలు అప్పగించేలా కమిషనర్‌ను ఆదేశించాలని కోరినట్టు చైర్‌పర్సన్ తెలిపారు. కమిషనర్ వైఖరితో నిరాశ్రయులకు అందాల్సిన సేవల్లో జాప్యం జరుగుతుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రశాంతంగా ముగిసిన పైడితల్లి జాతర



తప్పిపోయిన బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు

విజయనగరం క్రైమ్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. అయితే జాతరలో 80 ఏళ్ల వృద్ధులు, పదకొండేళ్ల బాలుడు తప్పిపోగా పోలీసుల చొరవతో చెంతకు చేరారు. తప్పిపోయిన బాలుడు పోలీసుల చెంతకు చేరగా మైక్‌లో ప్రకటించి కంట్రోల్ రూమ్‌కు బాలుడిని అప్పగించారు. అక్కడి పోలీసులు బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. సిరిమాను రథం నిర్దేశించిన సమయం కంటే కాస్త ఆలస్యంగా చదురుగుడి నుంచి ప్రారంభమైంది.

నాగావళిలో దూకి వ్యక్తి ఆత్మహత్యా యత్నం



కల్లేపల్లి జగదీష్ (ఫైల్)



వంతెన వద్ద గుమిగూడిన ప్రజలు

వంగర: మండల పరిధి రుషింగి వంతెన పైనుంచి నాగావళి నదిలో దూకి ఓ వ్యక్తి మంగళవారం ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. వీరఘట్టం మండలం బిటివాడ గ్రామానికి చెందిన కల్లేపల్లి జగదీష్ (33) వంగర మండలం మగ్గూరు గ్రామానికి చెందిన పార్వతిని కొన్నేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. చేపల వ్యాపారం రీత్యా గరుగుబిల్లి మండలం రావివలసలో స్థిరపడ్డారు. చేపల వ్యాపారం ముగించుకుని మగ్గూరు వస్తుండగా మార్గమధ్యలో ఉన్న రుషింగి వంతెన సమీపం వచ్చే సరికి వ్యాపార నిమిత్తం భార్యాభర్తలు ఇరువురు తగాదా పడ్డారు. ఈ క్రమంలో వంతెన వద్దే బండిని నిలిపివేసి భార్య ముంగిటే నదిలో దూకి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కిమ్మి, రుషింగి గ్రామాలకు చెందిన ప్రజలు అక్కడకు చేరుకుని గాలించినా ప్రయత్నం లేకపోయింది. భార్య పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నదిలో గల్లంతైన జగదీష్ కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామని హెచ్‌సీ దూసి రాములు తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం



విజిలెన్స్ అధికారులు సీజ్ చేసిన రేషన్ బియ్యంతో ఉన్న పికప్ వాహనాలు

గుమ్మలక్ష్మీపురం: మండలం నుంచి ఒడిశాకు రెండు పికప్ వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న నాలుగున్నర టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు శ్రీకాకుళం విజిలెన్స్ సీఐ డివివి.సతీష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు తమకున్న సమాచారం మేరకు విజిలెన్స్ ఎస్ఐ బి.రామారావు, రెవెన్యూ సిబ్బందితో కలిసి మంగళవారం ఇరిడి సమీపంలో వేచి ఉండగా రెండు పికప్‌లతో వస్తున్న రేషన్ బియ్యాన్ని గుర్తించి, స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఓ పికప్ వద్ద 50 బస్తాలు, మరో పికప్ వద్ద 40 బస్తాలు ఉన్నాయని, వీటి విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని, రెండు వాహనాలతో పాటు, పట్టుబడిన బియ్యాన్ని సీజ్ చేసి, బియ్యం తరలించిన వారిపై రెవెన్యూ అధికారులచే 6 ఏ కేసును నమోదు చేయించినట్టు సీఐ ఈ సందర్భంగా పేర్కొన్నారు. వీరి వెంట సీఎస్‌డీటీ శ్రీనివాసరావు, ఆర్ఐ బి.శివ తదితరులు ఉన్నారు.

రాత్రి వేళ కానరాని ఆర్టీసీ పండగ సర్వీసులు



బస్సుల్లేక సింహాచలం, శ్రీకాకుళం, విశాఖ వైపు బస్సులు వెళ్లే ప్లాట్ ఫారంపై ఎదురు చూస్తున్న ప్రయాణికులు

విజయనగరం అర్బన్: పైడితల్లి అమ్మవారి పండగ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు రవాణా సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు మంగళవారం రాత్రి వేళ కనిపించలేదు. వర్షం కారణంగా సిరిమానోత్సవం షెడ్యూల్ రెండు గంటల పాటు జాప్యం జరిగిన నేపథ్యంలో భక్తుల తిరుగు ప్రయాణం రాత్రి 9 గంటల వరకు కొనసాగింది. అయితే ఆర్టీసీ ప్రత్యేక సేవలను సాయంత్రం 7 గంటలకే ఆపేయడం వల్ల జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన భక్తులు ఇళ్లకు చేరడానికి ఇబ్బంది పడ్డారు. నిజానికి ప్రత్యేక సర్వీసుల షెడ్యూల్ ప్రకారం పండగ రెండవ రోజు మంగళవారం 80 బస్సులను ఏర్పాటు చేయాలి. సిరిమానోత్సవం జరిగేది సాయంత్రం 3 గంటలకు కాబట్టి ఆ తర్వాత ఎక్కువ సర్వీసులు వేయాలి, కానీ వేయకపోడం వల్ల జిల్లా కేంద్రం నుంచి విశాఖ, సింహాచలం, అనకాపల్లి, శ్రీకాకుళం, చీపురుపల్లి, పాలకొండ, సాలూరు, పార్వతీపురం, ఎస్.కోట ప్రాంతాల రూట్లలో రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.